# క్షేమయోగం

-భరాగో

"మిమ్మల్ని డిశ్చార్జి చేస్తున్నాం. కానీ మీరు వెంటనే విశాఖపట్నం వెళ్లిపోకుండా ఈ ఊళ్లోనే ఇంకొక నాలుగురోజులు ఉండడం మంచిది. మీకు ఒక మైల్డు స్ట్రోకు వచ్చింది. నూరు కిలోమీటర్ల రోడ్డు జర్నీ పడదు. మిమ్మల్ని ఎక్కడ దింపమంటారో చెప్తే మా అంబులెన్స్‌లో తీసుకెళ్తారు. మిమ్మల్ని ఇక్కడ జాయిన్ చేసిన వెంకట్రామరావుగారు కుటుంబంతో సహా పార్వతీపురం వెళ్లిపోయారు. ఈ ఉదయం ఆరు గంటలకొచ్చి చెప్పి వెళ్లిపోయారు. అయితే మా అంబులెన్స్ డ్రైవర్‌కి ఆ ఇల్లు తెలుసు" అని చెప్పారు ఆ నర్సింగ్ హోమ్ మేనేజర్.

"ఆ ఇల్లు వెంకట్రామరావుది కాదు, వాళ్ళ వియ్యంకుడిది. వాళ్లకి నేనెవరో కొత్తగా (కొద్దిగా) తెలిసినా నా ఈ అసౌఖ్య కాలాన్ని వాళ్లింట్లో గడపనిచ్చేటంతగా తెలియదు."

"లేదండీ. వెంకట్రామరావుగారితోపాటు ఆయన కూడా వచ్చారండీ. ఆయన పేరు రమణయ్యగారు. హైస్కూలు హెడ్మాస్టరుగా రిటైరయ్యారు. అరసవిల్లి రోడ్డులో విశాలమైన ఇల్లుంది. పెళ్లి వారంతా పార్వతీపురం వెళ్లిపోలేదు. రమణయ్యగారి భార్య, పెద్ద కోడలు, వంట మనిషి, చిన్న మనవరాలు అందరూ ఉన్నారు. ఉదయం ఇక్కడకొచ్చినప్పుడు వారు మరీ మరీ చెప్పారు మిమ్మల్ని డిశ్చార్జ్ చేసేటప్పుడు వారికి చెప్తే తమ ఇంటికి తీసుకుపోయి ఎన్నాళ్లయినా చూసుకోగలం అని."

"సరే. వారికి ఫోన్ చేసి ఇక్కడికోసారి రమ్మనండి. మీ నర్సింగ్‌హోం బిల్లు సెటిల్ చేసి ఆయనెలా చెప్తే అలా చేస్తాను. ఒక హోటల్లో రూమ్ తీసుకుని ఇవాళా రేపూ ఉండాల్సి వచ్చినా ఉంటాను. అక్కడ్నించే మా వాళ్ళకి ఫోన్ చేస్తాను" అన్నాను.

***

"మీ ఇంట్లో ఉన్నంత సౌఖ్యంగా ఉండకపోయినా మీకిక్కడ సాధారణంగా ఏ లోటూ ఉండదు. వెంకట్రామరావుగారు మీ గురించి నాకంతా చెప్పారు. మీరూ మీ ఆవిడగారూ, మీ అబ్బాయి, అమ్మాయి ఎంతో విద్యా సంపన్నులు. విద్వాన్ సర్వత్ర పూజయేత్ అన్నారు పెద్దలు" అన్నాడు రమణయ్యగారు, నన్నూ, నా సూట్‌కేస్‌ను, మందుల బుట్టనీ వాళ్లింట్లో గెస్టురూంలోకి తెస్తూ.

ఆ గెస్టురూంలో మూడు మంచాలు వాల్చి ఉన్నాయి. ఒకదాన్ని ఎత్తి గోడకి చేర్చారు.

"ఇది బల్ల మంచం. అది నవారు మంచం. మీకు ఏది నచ్చితే దానిమీద ఉండొచ్చు. మసల్దానికి జాగా కావాలని మూడోది ఎత్తేసాను. మీరు ఖాళీగా ఉంచే మంచం మీద మీ మందులూ, పుస్తకాలు, పేపర్లూ పెట్టుకోవచ్చు, అందుబాటులో వుంటాయి."

"మీకు చాలా ఇబ్బంది కలిగిస్తున్నాను. డాక్టర్లు నన్నీ ఊళ్లో రెండు మూడురోజులుండమన్నారు. ఏ హోటల్‌లోనైనా రూం తీసుకుని ఉండొచ్చు. అసలు ఆ నర్సింగ్‌హోమే ఒక పోష్ హోటల్లా వుంది."

రమణయ్యగారు చప్పుడు లేకుండా నవ్వారు.

"వాళ్ళకి మీరు రూం రెంట్ ఒక్కటే ఇస్తారు. అదే గదిని ఎవరైనా పేషెంట్‌కి ఇచ్చుకుంటే పుణ్యమూ పురుషార్థమూ కూడా కదా. ఐనా సరే మీరు వెంట్రామారావుగారికి స్నేహితులు కనుక మాకు వియ్యాలవారితో సమానం."

"ఈ సేవలూ, సౌఖ్యాలు మీరెప్పుడు నాకు బాకీ ఉన్నారో పాపం" అన్నాను.

"అమ్మమ్మ... అలా అనకండి. ఎంత పుణ్యం చేసుకుంటే మీలాంటి వాళ్ళు మా ఇళ్ళకొస్తారు. ఒక స్కూల్లిన్‌స్పెక్టరు కూడా రాలేదు నేను ఉద్యోగంలో వున్నప్పుడు.

***

రమణయ్యగారిల్లు చాలా బావుంది. మూడు వందల ముప్పయి మూడు గజాల చొప్పున వేసిన ప్లాట్లలో పక్క జాగాలు రెండు కొనుక్కుని చుట్టూరా పదిహేనేసి అడుగుల స్థలం వదిలేసి కిందని ఐదు పడకల గదులు, మేడమీద ఒక విశాలమైన జాఫ్రి షెడ్డు కట్టారు. కిటికీలూ, షెల్ఫులు, కారిడార్లు, వంటిల్లు, డైనింగ్ హాలూ కలిపి నాలుగు వందల చదరపు అడుగుల పై మాట. గెస్టు రూం మాత్రమే స్నానాలగదీ, మరుగుదొడ్డీ కలిపి అమర్చారు. ఆ గది అన్నిటికంటే విశాలమైంది. తల్లిదండ్రులకి ఒకటీ, పెద్దకొడుక్కి కోడలికి ఒకటీ, చిన్నకొడుక్కీ, కోడలికి ఒక్కటీ మొత్తం మూడు వేరే వేరే టెలిఫోన్లు.

రోజా ఒకావిడ తెల్లారగట్ట ఐదున్నరకొచ్చి వంట పని అంతా చూస్తుంది. రాత్రి ఎనిమిది గంటలకి భోజనం చేసి వెళ్తుంది. పువ్వులు కొయ్యడం నుంచి ఊరగాయలు పెట్టడంవరకు ఆవిడ చేతుల మీదుగానే జరుగుతాయి. పని కుర్రాడు ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం పన్నెండుదాకా, మధ్యాహ్నం మూడు నుంచి సాయంకాలం ఏడు దాకా ఉంటాడు. బజారు పనంతా వాడే చేస్తాడు. మొక్కలకి నీళ్ళు పోయడం, కూరాకాయా తెంపి ఇంట్లో చేర్చడం వాడి డ్యూటీలే.

పనమ్మాయి ఉదయం ఆరున్నరకోసారి, సాయంకాలం ఐదుకీ ఒకసారి, వచ్చి ఇల్లూ వాకిలీ ఊడ్చడం, కడగడం, బట్టలు ఉతికి ఆరేయడం, గిన్నెలు కేరేజీలు తోమడం సమస్తమైన పనులూ చేస్తుంది.

***

రెండోరోజు సాయంకాలం ఫోన్ తీసాను. విశాఖపట్నంలోని మా ఇంట్లో నెంబరు కొట్టాను.

ఎవరూ తియ్యలేదు.

మా అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో ఫోన్లు సాధారణంగా చస్తూ ఉంటాయి. రోడ్డుకి ఇటువేపు మేము, అటువేపు మా టెలిఫోను పోలు. ఆ పోలు ఎత్తు పన్నెండు అడుగులు. మా అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో ఉన్న పన్నెండు ఫ్లాట్లలో పదకొండు టెలిఫోను కనెక్షన్లు ఉన్నాయి. ఈ వైర్లన్నీ ఆ పోలు నుంచే వస్తాయి. రోడ్డుమీద పన్నెండు అడుగుల కన్నా ఎక్కువ ఎత్తుగా ఉన్న వాహనం ఏదైనా మా రోడ్డు మీదుగా వెళ్లిందంటే మా పదకొండు వైర్లలో ఏవో కొన్ని తెగిపోతాయి. కంప్లైంటు చేయడం, కంప్యూటర్‌లో రిజిస్టర్ కావడం, లైన్‌మెన్‌కి ఆర్డర్లు వెళ్లడం, తెగిన వైర్లు ముడులు వేయడం ఇదంతా స్మర వారం వారం, చర వారం వారం.

అందుచేత మా పక్క ఫ్లాటు వాళ్ల నెంబరు కొట్టాను.

'పావని!'

"అమ్మా! బతికించారు. మా ఆవిడ ఇంట్లో లేదా? లేక మా ఫోన్ చచ్చిందా?"


"నిన్న ఉదయం పార్వతీపురం నుండి వెంకట రామారావుగారు ఫోన్ చేసారు. మీరింకో రెండు వ ంూాడ ం రోజులవరకూ రార్దగా. అన్నపూర్ణమ్మగారు నిన్న సాయంకాలం వాళ్లక్కగారింటికి వెళ్లారు. రేపు సాయంకాలానికి వస్తానన్నారు. మీరు బాగున్నారా?"

"ఫస్ట్‌క్లాస్!"

"ఎప్పుడొస్తారు?"

"నేనా?" రమణయ్యగారు నా కుడి జబ్బ పట్టుకున్నారు. నా అరచేతిమీద తన వేలితో 12 అని ఒక అంకె రాసాడు. "ఎల్లుండి అదే పన్నెండో తేదీ సోమవారం తెల్లారగట్ట ఫస్టు బస్సులో బయల్దేర్తాను. ఉంటానమ్మా మరి!"

రమణయ్యగారు నా భుజం మీద రెండు థేంక్సు తట్టాడు.



***


"ఒంటరిగా ప్రయాణం చేయకండి. దగ్గరా దూరం అనే తేడా లేకుండా ఏసిలోనే వెళ్లండి. మీతో నిరంతరం మీ మెడికల్ రికార్డూ, టాబ్లెట్సూతోపాటు ఐదువేల రూపాయల నగదు ఉంచుకోండి."

ఎనిమిదేళ్లక్రితం నాకు మొదటిసారి గుండెపోటు లాంటిది వచ్చినప్పుడు నన్ను ఆస్పత్రి నుంచి విడుదల చేసిన డాక్టరు మూర్తిగారు చెప్పిన మాటలు అవి.

విశాఖపట్నం నుండి శ్రీకాకుళం నూరు కిలోమీటర్లు. రైల్వే తప్ప ఏసి ఉండదు. ఏసి కార్లు ఉంటాయి కాని రానూపోనూ వెయిటింగ్ కలిపి రెండువేల రూపాయలడిగాడు. అన్నపూర్ణ వస్తుందంటే పోనీ అని సరిపెట్టుకోవచ్చు. కానీ తను రానంది. ఏసి కోసం రైల్లేనే వెళ్లాలంటే విశాఖపట్నం రైల్వేస్టేషన్‌కి మా ఇంటి నుండి పన్నెండు కిలోమీటర్లు వెళ్లాలి. శ్రీకాకుళం రోడ్డు అనే ఆముదాలవలస స్టేషన్‌లో దిగినా ఆ రైల్వే స్టేషన్ నుండి శ్రీకాకుళంలో ఉన్న ఈ వివాహ మండపానికి పదహారు కిలోమీటర్ల రోడ్డు ప్రయాణం. ఇవన్నీ ఆచరణలో కష్ట సాధ్యం. ఇంతకీ ఎనిమిదేళ్ళనాడు కలిగిన అస్వస్థత గుండెపోటు అనిపించుకోదని, రిస్కు ఎక్కువలేదని మెడికల్ రికార్డులలో వుంది. ఆరేసి నెలలకోసారి చేయించుకుంటున్న సమగ్ర పరీక్షలలో అదనపు అస్వస్థత ఏమీలేదు. మరి కొన్నాళ్లు మందుల వాడకంతో సరి పుచ్చుకోవచ్చు అని రాస్తున్నారు. ప్రయాణాలు బాగా తగ్గించుకుని తప్పనిసరిగా చేయవలసి వచ్చినప్పుడు ఏసి పెట్టిలోనే వెళ్తూనూ బండిని లాక్కొస్తున్నాను.

ఎంకి పెళ్లి సుబ్బి చావుకి వచ్చిందని చాలా కాలం కిందట ఒక నానుడి ఉండేది. ఇప్పుడు నేను విశాఖపట్నం నుంచి శ్రీకాకుళానికి బస్‌లో వెళ్లవలసిన అవసరం తెచ్చిపెట్టిన (నా స్నేహితుని కొడుకు) మురళి పెళ్లి నా చావుకి దారి తీయకపోయినా హాస్పిటల్‌దాకా తీసుకెళ్లింది. అదేమిటో మన ముహూర్తాలు మనమూను. నూటికి తొంభై వరకు అర్ధరాత్రి దాటేకానూ, తెల్లారగట్ట నాలుగులో పునీనూ పెడతారు. ముస్లిములు, క్రిస్టియన్లు ఆఖరికి సిక్కులు కూడా పెళ్లిళ్ళు ఆదివారాలు ఉదయం పూట చేసుకుంటారు.

ఈ పెళ్లి ముహూర్తం మొన్న బుధవారం రాత్రి 12.51కి. ఏ తొమ్మిది గంటలకో నిద్రపోయి ముహూర్తం వేళకి లేవగలిగే టైము కాదు, కనుక నిద్రని వాయిదా వేసుకుని మాంగల్యం తంతు నానేనా ఎండేనా, తేల్చుకుని చేసిన ప్రయాణాన్ని సార్థకం చేసుకోవాలని ఆ పెద్ద హాలులో ఒక వార కూర్చుని ఉండిపోయాను. ఎవరెవరో వచ్చి పలకరిస్తూ మధ్యే మధ్యే పానీయాలు సమర్పించుకుంటూ గౌరవంగానే చూసుకుంటున్నారు.



## ఇంపీరియల్ పేలస్

చైనాలోని బీజింగ్ నగరంలో ఉన్న ఇంపీరియల్ పేలస్‌కు ఉన్న విశిష్టత ఏమిటో మీకు తెలుసా? ప్రపంచంలోని రాజ ప్రాసాదాలన్నింటిలో అత్యంత పెద్ద పేలస్ ఇదే. 72 హెక్టార్ల విస్తీర్ణంలో ఉంది ఈ పేలస్. ఈ పేలస్ నిర్మాణం 15వ శతాబ్ద కాలంలో జరిగినప్పటికీ ఎప్పటికప్పుడు సరికొత్త నిర్మాణాలు ఈ పేలస్‌లో జరుగుతునే ఉన్నాయి.


## మహారాజుకి సంకెళ్లు

రెండు చేతులూ పనిచేయకపోతే రెండు నిమిషాలు కూడా ఉండలేం. అలాంటిది చరిత్రలో తన చేతికి సంకెళ్లు లేకపోతే తెగ బాధపడిపోయే రారాజు ఒకరున్నారండీ. 1172 నుండి 1226వ సంవత్సరం దాకా బాగ్దాద్ నగరాన్ని పాలించిన ఖరీదా ఫాదకెర్ అన్న మహారాజు ఇష్టప్రకారం తనకి బుద్ధి పుట్టినప్పుడల్లా చేతులకు సంకెళ్లు వేసుకుని రాజ్య పాలన చేసేవాడు. ఇందుకు కారణం ఈయన రాజుకాక పూర్వం చేసిన నేరాలకు శిక్ష స్వయాన తన కన్నతండ్రి చేతనే 19 సంవత్సరాలు చేతులకు సంకెళ్లు వేయించుకున్నాడట. రాజు అయ్యాక కూడా నేరాలున్నప్పుడల్లా రెండు చేతులకూ బేడీలు ధరించేవాడట. చరిత్ర పుటల్లో నిక్షిప్తమైన వింత యదార్థ గాథ ఇది.

## 70 పాటలున్న సినిమా!

భారతదేశ సినీ చరిత్రలో 70 పాటలున్న ఓ సినిమా ఉంది. 1930లో రిలీజయిన 'లవకుశ' తమిళ సినిమాలో మొత్తం 70 సాంగ్స్ ఉన్నాయి. ఈ చిత్రంలోని పాత్రలన్నీ పాటలు పాడడం మరో విశేషం!

-శశి




రాత్రి పదిన్నర దాటాక గుండెలో మంటలాంటిది ప్రారంభమైంది. ఆ మంట ఒక గంటలో తంటాగా మారింది ఆ ఇంటికి. నోటితో ధైర్యం చెప్తూనే నొసటితో 'వీడెక్కడ కునికేస్తాడో ఏమిటో' అని బెంగ పెట్టుకుంటున్నట్లు తెలియకుండా నన్ను ఆఘమేఘాలమీద నర్సింగ్‌హోమ్‌లో చేర్చారు.

"నేను బాగానే వున్నాను, మీరెవరూ మీ పనులేవీ మానొద్దు" అని సూట్‌కేసు అందుకున్నాను. అందులో ఉన్నది ఐదువేలే అయినా అదే నాకు పదివేలు కదా. తలగడాలు ఎత్తుగా పేర్చారు. మోచేతికొకటీ, గుండెకొకటీ తగిలించారు. మంచం మీద ఉండగానే రక్తం తీసుకున్నారు. పదేసి నిముషాలకోసారి 'బెంగ పెట్టుకోకండి. మీకేం కాలేదు. 48 గంటలు మిమ్మల్ని అబ్జర్వేషన్‌లో ఉంచుతారు' అని ఎవరెవరో వచ్చి చెప్పి వెళ్తున్నారు.

33 గంటలు అయ్యేసరికి 33 వందలు కూడా అయింది. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటల నుంచీ ఇక్కడ ఉన్నాను.

★★★

ఆదివారం ఉదయం ఎనిమిదిన్నరకల్లా వంట గది పక్కనున్న నట్టింట్లోకి అందరూ చేరి నన్నక్కడికి పిల్చుకెళ్లారు. వినిపిస్తోందా లేదా అన్నంతగా పాత సినిమాల్లో నేపథ్య సంగీతం స్థాయిలో లలిత సహస్రనామం ఈశాన్యం మూలని అమర్చిన స్పీకర్‌లోంచి. రాత్రి ఏ వేళప్పుడొచ్చారో, రమణయ్యగారి అబ్బాయిలిద్దరూ అక్కడున్నారు. కోడళ్ళు, మనవళ్ళు, మనవరాళ్ళు చేరున్నారు. రమణయ్యగారూ, శాంతమ్మగారూ సరేసరి. ఆగ్నేయపు మూలని స్టూలుమీద వంటావిడ. ఇంట్లో ఒక పండుగో, నోమో, వ్రతమో జరిగేటప్పట్లాగ కళకళ్లాడుతూ వాళ్ళంతా అక్కడ చేరి సందడిగా ఉండడం చూసి నాకెంతో కులాసా వేసింది.

రమణయ్యగారు 'ఊ' అని ఒక చెయ్యి పైకెత్తి 'సైలెన్స్' అనకుండానే నిశ్శబ్దాన్ని సాధించాడు.

"అందరూ ఆయనకి నమస్కారం చేసి దీవెన్లు తీసుకోండి. వారు మన వెంకట్రామారావుగారి క్లాస్‌మేట్ శివయ్యగారు. వారి ఇల్లంతా సరస్వతీ నిలయం. వారి ఇల్లాలు అన్నపూర్ణమ్మగారు డాక్టరుగా రిటైరయ్యారు. అబ్బాయి మేనేజిమెంటు ప్రొఫెసరు. అల్లుడు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. కోడలు హోటల్ మేనేజరు. కూతురు ఫేషన్ డిజైనరు. ఈయన తప్ప అందరూ అమెరికాలోనే వుంటారు. ఈయన విశాఖపట్నంలో ఒక గొప్ప కార్పొరేట్ కాలేజీలో మేథమేటిక్స్ ప్రొఫెసరుగా ఉన్నారు."

వరుసగా ఇద్దరేసి ఒక్కొక్కరూ వచ్చి నా కాళ్లకి దండాలు పెడుతున్నారు. దీర్ఘ సుమంగళీ భవ, దీర్ఘాయురస్తు, సకల మంగళానిభవన్తు అంటూ నోటికేదొస్తే అది అంటున్నారు. రమణయ్యగారు కొడుకులిద్దరి భుజాలమీదా రెండు చేతులూ వేసి నా దగ్గరిగా తీసుకొచ్చి వాళ్ళని గురించి చెప్పారు.

"వీడు మా పెద్దబ్బాయి శంకరం. స్టాటిస్టిక్స్‌తో ఎమ్మే. యూనివర్శిటీ సెకెండ్. గ్రూప్ టూ సర్వీసెస్ పరీక్షకి కట్టి సబ్ రిజిస్ట్రారుగా సెలెక్టయ్యాడు. పధ్నాలుగేళ్లయింది. వీడు మా రెండోవాడు వీరభద్రం. బిఎస్సీ ఫిజిక్స్, ఆటో మొబైల్ డిప్లొమా. వీడూ గ్రూప్ టూకే వెళ్ళాడు. మోటార్ వెహికిల్ ఇనస్పెక్టర్ అయ్యాడు. పన్నెండేళ్లయింది. చిత్రం ఏమిటంటే వీళ్లిద్దరికీ పదేసేళ్ళు సర్వీసయినప్పటికే మా అమ్మాయి పెళ్లి కుదిరింది. గాయత్రి దాని పేరు. మీ వెంకట్రామారావుగారి కోడలన్నమాట. మా అబ్బాయిలిద్దరూ కూడి గాయత్రి పెళ్లి స్వగృహంలో చేయండి నాన్నగారూ అని నా పేర్న ఈ ఇల్లు కట్టించారు. ఇంకా చదువుకోండర్రా, విదేశాలకి వెళ్లి పేరు ప్రఖ్యాతులు తెచ్చుకోండర్రా అని నేనెంత పోరినా వినిపించుకున్నారుకారు. దానికి మా ఆవిడే కారణం కాబోలు. ఆవిడ ఏమీ చదువుకోలేదు. అజ్ఞానంవల్ల కొంత తృప్తో ఆనందమో కలుగుతుంది కాబోలు మరి.

'అమెరికా వెళ్లిపోతే వచ్చేవి పేరు ప్రతిష్ఠలు కావు, డబ్బేను. దూరం వెళ్తే డబ్బొస్తుంది గానీ ఆ డబ్బు దూరాన్నింకా పెంచుతుంది. ఆమాత్రం అన్నం ఈ దేశంలో కూడా ఉంది నాయన్లారా' అని వాళ్ళనాపేసింది. మాకిద్దరికీ అభిప్రాయభేదం ఈ ఒక్క పాయింటు మీదనే. మా మనవళ్ళ తరంలోనైనా నా ఆశ నెరవేరుతుందేమో చూడాలి మరి."

అందరం ఆ పెద్ద డైనింగ్ టేబుల్ చుట్టూ చేరేం. ఫలహారాలు చేసేం. ఎవరికి ఇష్టమైనట్టుగా వారు కాఫీ, మజ్జిగ, పాలు పుచ్చుకున్నాం.

★★★

నా ప్రయాణం మర్నాటి ఉదయానికి అసలు.

కానీ, అప్పుడే తొమ్మిదిన్నర కాకుండానే అక్కడినుంచి బయల్దేరియ్యాలని అనిపించేసింది. వీరభద్రం క్షణాలమీద ఒక ఏసి కారు గుమ్మంలోకి రప్పించాడు. నాకూడా విశాఖపట్నం వచ్చాడు. మా వదినగారింటి దగ్గర కారు ఆపించి మా ఆవిణ్ణి కార్లో ఎక్కించి ఇద్దర్నీ మా ఇంటికి చేర్చేడు.

"మీకొంట్లో బావులేని సమయంలో మీకు సహాయపడగలిగేం. అది మా అదృష్టం" అని శ్రీకాకుళం వెళ్లిపోయాడు.

★